కథ

# చీమలు

జొన్నలమూడి రామకృష్ణారావ్

**చీమలు... గండుచీమలు... గుంపులు గుంపులుగా... వరుసలు వరుసలుగా... తీరికలేని... తమ పనేమిటో తామేగా... వరండా అంతా పరచుకొని ఉన్నాయి... చీమలు... నల్లని చీమలు...**

**'ఛీ ! వెధవ చీమలు... పుట్టలు పెట్టాయి...'' అంటూ కంగారుగా తన భుజం మీదున్న టి.వి.ని ఎక్కడ దించాలో తెలియక తికమకపడుతున్నాడు శేషగిరి.**

"ఇక్కడ పెట్టరా ముందు" తాను కూర్చొని ఉన్న పాతకాలపు కుర్చీని చూపించారు సుందరరామయ్యగారు తాను లేస్తూ. రిక్షావాడికి డబ్బులివ్వడానికి వెళ్లాడు శేషగిరి, టి.వి.ని అక్కడ పెట్టి. రిక్షావాడు ఓ రూపాయి ఎక్కువ ఇవ్వమన్నాడు. ఇవ్వనంటే ఇవ్వనంటాడు శే గిరి. రిక్షావాడు కేకలేయడం మొదలుపెట్టాడు. తప్పనిస రై వాడడిగినంత ఇచ్చి ఇంట్లోకి వచ్చాడు.

"ప్రతివాడు త్రాగేది.. తగాదా పడేది... ఎక్కువ డబ్బులివ్వమనేది...!" విసుగుకుంటూ "పాడు చీమలు పాడు చీమలు..." అనుకుంటూ అడుగులు చీమలపై పడకుండా లోపలి కెళ్లాడు శేషగిరి.

★ ★ ★

చీమలను చూస్తే శేషగిరికి ఎక్కడలేని ఎలర్జీ... చికాకు. అవి ఎక్కడ కుడతాయో అనే భయం కూడా లేకపోలేదు. చీపురు తెచ్చి కాళ్లకు చెప్పులేసుకుని ఒక మూలకు బలవంతాన చిమ్మాడు. గమాక్సిన్ తెచ్చి చల్లాడు. అతనిలోని 'ద్వేషభావం పురులు విప్పింది.

"ఎందుకంతే ఇంత హడావిడి చేస్తారు" భార్య పార్వతి భర్త చేసే హడావిడికి చికాకుపడింది.

"మీకేం అనిపించడం లేదా! అవి తిరుగుతుంటే..." ఆశ్చర్యపడ్డాడు శేషగిరి.

"ఏమీలేదే" అతి సహజంగా తన పనిలో దూరిపోయింది సతీమణి.


అవి నిన్నేం చేశాయిరా? వసంతమ్మ కొడుకు శేషగిరిని కోపంగానే అన్నది. ఐదు నిముషాల్లో చీమలన్నీ మాయమయ్యాయి.

★ ★ ★

వసంతమ్మ సుందరరామయ్యలకు శేషగిరి ఏకైక సంతానం. గారాబంగా పెరిగాడు శేషగిరి. నాలుగైదేళ్లు అయింది పార్వతి శేషగిరిల వివాహం జరిగి.

సుందరరామయ్య రిటైరైపోవడంతో కావలిలో కాపురం ఎత్తివేసి నెల్లూరుకు చేరాడు కొడుకు దగ్గరకు. శేషగిరి నెల్లూరులో స్టేట్ బ్యాంక్‌లో క్యాషియర్‌గా చేస్తున్నాడు. తల్లీదండ్రీ రావడంతో పూర్వం ఉన్న ఇల్లు చాలక ఈ ఇంట్లోకి కొద్దిగా అద్దె ఎక్కువపెట్టి మారారు.

★ ★ ★



"ఈ దోసకాయ కూర తప్ప ఇంకేమి దొరకలేదా!..." విస్తరి ముందు కూర్చున్న సుందరరామయ్య కోపంగా అన్నాడు. సుందరరామయ్యగారు అన్ని విషయాలలోనూ శాంతస్వరూపుడే గాని ఆహారం దగ్గర మాత్రం తనకిష్టం లేనిది జరిగితే అప్పుడే వెళ్లగ్రక్కుతాడు.

"ఏవమ్మా పార్వతీ! ఆయనకు ఆయాసంగ ఉన్నదని... మధ్యాహ్నం చెప్పాను గదా..." వసంతమ్మ... అతి సాధారణంగా అన్నది, ప్రక్కనే ఉన్న కోడలితో అన్నది... అత్తగారు....

కోడలు పార్వతి బహుసూక్ష్మం. కోపం పొడుచుకువస్తుంది. సూటిగ సమాధానం చెప్తుంది. అర్థాలు తీస్తుంది.

"నేనేమి కావాలని చేశారంటారా!... మీ కొడుకు చౌకగా వస్తున్నాయని ఏకంగా ఒక కేజీ దోసకాయలు తెచ్చారు. ఉన్నది నల్గురం... ఇంట్లో కూరలు నిండుకున్నాయి... అందుకని... దోసకాయ తగలేశాను".

"ఏమిటే... ఆ మాటలు... ఇప్పుడు నిన్నేమన్నారని" తన తల్లిదండ్రులను గౌరవించవలసిన వాళ్లను అలా మాట్లాడితే ఊరుకోలేక, ఉండబట్టలేక అన్నాడు శేషగిరి.

"నాకు మాట్లాడడం చేతకాదులెండి" అంటు రెట్టించింది. బెడ్‌రూమ్‌కు వెళ్లిపోయింది.

"అమ్మా!... నాన్నా... బాధపడకండి. దాని స్వభావమే అంత. కోపిష్ఠిది" నర్దిచెప్పాడు శేషగిరి.

"అయితేమటుకు చిన్నాపెద్దా తారతమ్యం లేదట్రా..."

★ ★ ★

"పార్వతీ!' శేషగిరి పిలుపుకు జవాబులేదు. బెడ్‌రూమ్‌లో... అలుముకున్న చీకట్లో... తలపై చేయిపెట్టుకుని శయ్యాగృహంలో అలుకవహించిన సత్యభామలా ఉంది.

"పార్వతీ... భోజనం చేయి..."

"నాకొద్దు..."

మళ్లీ బ్రతిమలాడలేదు శేషగిరి. ఆమె స్వభావం తనకు తెలుసు. ఏదైనా అలిగితే వారాలు రోజులు మాట్లాడదు. తానే ఏదో ఒకటి చేసి ఆమెను ప్రసన్నం చేసుకునేవాడు.

తల్లిదండ్రులు వృద్ధులు... తన దగ్గర ఉండాలని వచ్చారు. వచ్చి ఎన్నో రోజులు కాలేదు... ఇలా కించపరచడం శేషగిరికి ఎంతో బాధగా ఉంది. భార్యపై కోపం కూడా వచ్చింది. తనను తాను నియంత్రించుకోగలడు శేషగిరి.

★ ★ ★

మరురోజే క్యాంపుకు వెళ్లాల్సి వచ్చింది శేషగిరికి. "క్యాంపు వెళ్తున్నాను నాన్నా" పెద్దగా చెప్పాడు భార్య కూడా వినాలని. మళ్లీ తిరిగి వచ్చేసరికి మరురోజు రాత్రి పదిగంటలైంది. అందరూ నిద్రపోతున్నారు. నిశ్శబ్దనిశీధం. తలుపు తీశాడు తండ్రి.

"అన్నం తిన్నావట్రా".

"ఊఁ" స్నానం చేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్లాడు.

నిజానికి తాను అన్నం తినలేదు. ఆకలి అవుతున్నా తినాలనిపించడంలేదు. ఎక్కడి నుంచో ప్రయాణంచేసి వచ్చిన తనకు భార్య ఎదురు వస్తుందని ఆశించాడు. హృదయం ప్రేమ కోసం పరితపిస్తున్నది. ఆమె ఎదురు రాకపోయేసరికి గ్రహించాడు, పార్వతి కోపం తగ్గలేదని.

"ఏయ్! పార్వతీ!... నిన్నే... నాకు ప్రమోషనిచ్చారు తెలుసా... ఇవ్వాళే తెలిసింది... నువ్వు అన్నం తిన్నావా..." అంటూ.



"మీరు అబ్బాయికి సొంత వారా,
అమ్మాయికి సొంత దారా"
"మీరు వేసుకొన్న చెప్పులకు
సొంత దాన్ని"

తిరుపతయ్య, కల్‌పాకం

"నీవు మాట్లాడకపోతే నాకు తోచదే... నాకు ఆకలేస్తుంది. మధ్యాహ్నం కూడా అన్నం తినలేదు, వీలుకాలేదు". పార్వతి కోపం తగ్గింది. లేచి శేషగిరి, తాను ఇద్దరు భోంచేశారు. గ్రహణం విడిచినట్లనిపించింది శేషగిరికి.

★ ★ ★

"ఏవండీ!.. ఏవండీ..." పార్వతి గోముగా ప్రారంభించింది పండుకోగానే, ఓ రోజు.

"ఏమిటీ..." ఏదో ప్రత్యేకమైన కోరిక ఉంటేనే కాని ఆమె ఆ విధంగా మాట్లాడదని తెలుసు శేషగిరికి.

"మీ నాన్నకు రిటైర్మెంటు డబ్బులు వచ్చాయటగా..." "నాకు నిద్రవస్తోంది పార్వతీ! రేపు మాట్లాడుకుందాం" అంటూ నిద్రలోకి జారుకున్నాడు... కాదు జారుకున్నట్లు నటించాడు. రాబోయే ప్రమాదాన్ని గ్రహించి.

★ ★ ★

నిశాంత సమయం. చీకటి పారద్రోలడానికి బయల్దేరిన సూర్యుని వార్తను తీసుకువస్తున్న వెలుగు రేకలల్లుకుంటున్నాయి జగమంతా...

రోజూలాగే... ఆ కోయిల....



రాజా: ఆషా! మన పెళ్ళికి మన పెద్ద వాళ్ళు వప్పుకోవడం లేదు. ఏం చేయాలిప్పుడు?
ఆషా: హమ్మయ్య! బ్రతికిపోయాను! ఏ ఉద్యోగం లేని నిన్నెలా పెళ్లిచేస్కోవాల అని - తెగ వర్రీ అయ్యాననుకో!

సాహితి [నందికొట్కూరు]

పలకరింపు పల్లవి అందుకున్నది. శేషగిరి తన చెలికత్తెను మేల్కొలిపాడు. "కోయిల... చూచావా... పలకరిస్తోంది" "ఊఁ" అంటూ అతడి కౌగిలిలో ఇంకొంత ఒదిగిపోయింది పార్వతి. తరుశాఖలలో నుంచి చిరు కలకలం మొదలవుతున్నది. పక్షుల కిలకిలలతో నిశి మసి అయినందుకు ఆనందిస్తున్న జీవజాలప్రమోదాన్ని సూచిస్తున్నాయి. ఈలోగా ఓ తుపాకీ పేలిన శబ్దం ఆవరణమంత వ్యాపించింది. ఆ వృక్షాలలో ఉన్న పక్షులన్ని ఒక్కమారుగా పైకి లేచాయి. మత్తులో ఉన్న శేషగిరి ఉలిక్కిపడి లేచాడు. "వాతవరణం ఎంతకల్లోలితమైందో" తెల్పుతున్నట్లుగా.

× × ×

"మీ ఆవిడకు... మా దగ్గర డబ్బులుండటం... ఇష్టం లేనట్లుందిలే..." వెటకారంగా అంది వసంతమ్మ.

భార్య ప్రోద్బలంతో స్వార్థంతో "ఇల్లు కట్టుకుందాము. డబ్బులడగమంటోంది" అంటూ తన కోరికను భార్యపై దోశాడు శేషగిరి. సుందరరామయ్య తెలివి తక్కువవాడు కాదు.

"గిరీ! నీకు డబ్బులకు కొదువట్రా. మీ బ్యాంకు వాళ్లు అప్పిస్తే ఇల్లు కట్టుకోవచ్చుకదా! భార్య అడగమంది. ఈయన అడుగుతున్నాడు..."

"రేపు మాకేదన్నా అయితే మందుమాకు ఎవరు చూస్తార్రా. నీ భార్య దయ ఏ పాటిదో నీకు తెలీదా!"

"అదీ నిజమే!" అని మనసులో అనుకుంటున్నాడు శేషగిరి. చాటుగా వింటున్న పార్వతి అపరదుర్గమ్మే అయింది.

"దారినబోయే వాళ్లందరికి చేయడం నా పనికాదు. చాకిరి చేయలేకపోతున్నాను. మా పుట్టింటికిపోయి విశ్రాంతి తీసుకువస్తాను" అంటు వంకపెట్టుకుని పుట్టింటికి వెళ్లింది పార్వతి.

మరురోజే కొడుకుకు సలహా ఇచ్చింది తల్లి. "నీ పట్టు సడలించవద్దురా! అలుసైపోతావు" అంటు.

"విశాఖపట్నం వెళ్లి వస్తాముర! మీ మేనత్తను చూచి చాలా రోజులైంది. అంటూ సుందరరామయ్య, వసంతమ్మలు వెళ్లిపోయారు.

నెల రోజులు అలా దొర్లిపోయాయి. హొటల్లో తిండి తింటున్న శేషగిరి సగమయ్యాడు. గడ్డం కూడా మాసి తన దిగులు ఎవరితోనూ చెప్పుకోలేక పోతున్నాడు.

× × ×

రాత్రి 12.30 అవుతున్నది. నిద్రపోదామని ప్రయత్నిస్తున్నాడు శేషగిరి. విఫలుడౌతున్నాడు. తల్లిదండ్రులుగానీ భార్యగానీ ఎవరూ జాబు కూడా వ్రాయలేదు. ముసురుకుంటున్న ఆలోచనలకు అడ్డుకట్ట వేయడానికి ఏదో ఒక పుస్తకం చదువుదామని తీశాడు.

మహాభారతంలోని ఆదిపర్వం... కణ్వమహాముని ఆశ్రమం... ఆ ప్రశాంత ఆశ్రమంలో... సహజ వైరి జంతువులు పిల్లి, ఎలుక, సింహము, ఏనుగు, పులులు, లేళ్లు వాటి వైరాన్ని విడిచిపెట్టి స్నేహభావంతో సంచరించడం... ఆ ఘట్టం చదివాడు. వాటిని ఏ బంధం అలా చేయగలిగింది... పరస్పర ప్రేమ... చల్లగా నిద్రలోనికి జారుకున్నాడు.

× × ×

"ఈ రోజు ఉదయం నుండి నగరంలో కర్ఫ్యూ విధించడమైనది. ప్రజలెవరూ వీధులలో సంచరించరాదు." మైకులో వినబడుతున్నది. పోలీస్ వ్యాన్‌లు తిరుగుతున్నాయి వీధులలో.

"స్థానిక నాయకుని హత్య... ఇరువర్గాల ఘర్షణ వలన 100 మందికి గాయాలు. నగరంలో ఉద్రిక్తత... కర్ఫ్యూ" పేపరులోని వార్తలు.

"మళ్లీ ప్రకటించేవరకు బ్యాంకులకు, స్థానిక సంస్థలకు, పాఠశాలలకు సెలవు" టి.వి.లో ప్రకటన వచ్చింది.

× × ×

శేషగిరి...

ఓ మధ్య తరగతి జీవి..

తల్లిదండ్రులనూ, భార్యనూ ప్రేమిస్తాడు. వారిని సమన్వయపరచలేకుండా ఉన్నాడు.

తల్లిదండ్రులు తనను ప్రేమిస్తారు.

కాని తన భార్యను ద్వేషిస్తారు.

పార్వతి తనను ప్రేమిస్తుంది.

తన తల్లిదండ్రులను ద్వేషిస్తుంది.

వాళ్లు పరస్పరం ద్వేషిస్తున్నారు అనే కంటే ఒకరిపట్ల ఒకరు ప్రేమ పెంచుకోలేకపోతున్నారు. అవగాహన చేసుకోలేకపోతున్నారు.

ఈ స్వభావం ఎందుకు కలుగుతుంది.

శేషగిరికి చీమలను చూచి భయమో ద్వేషమో ఎందుకుకలిగింది. తన అభద్రతా భావన.

ఇపుడు తమను ప్రేమిస్తున్న కుమారుడు తమనే ప్రేమిస్తూ ఇంకొకరిని ప్రేమించకూడదనే స్వార్థం.

భర్త తనను తప్ప ఇతరులను ప్రేమించకూడదనే స్వార్థం.

పక్షులు, జంతువులు, అనేక జీవరాసులు మానవుడికి ఉన్న మెదడు లేకపోయినా మానవుడికున్నంత స్వార్థం వాటికిలేదు. మానవుడికున్నంత ద్వేషమూ వాటికి లేదు.

*** *** ***

"అమ్మాయికి మూడో నెల. మీరు అమ్మమ్మ కాబోతున్నారు." పార్వతిని చూచిన డాక్టర్ అరుణ ఆమె తల్లితో చెప్పింది.

ఇంటికి వచ్చిన పార్వతి విచారవదనంతో ఏదో ఆలోచనల్లో ఉన్నట్లు పరధ్యానంగా ఉన్నది.

ఆమె తల్లి పార్వతిని నిలదీసింది. కన్నకూతురు ముఖంలో వివర్ణత ఆమె గమనించింది.

ఇక దాచలేకపోయింది పార్వతి. అన్ని వివరంగా చెప్పింది తల్లికి.

"భర్త అంటే మరబొమ్మ అనుకున్నావా. నీవాడించినట్లల్లా ఆడడానికి. భర్త నీకు ఏడుగడ. దిక్కు. భర్త వదలివేసిన స్త్రీకి సంఘంలోను, శుభకార్యాల్లోనూ విలువ ఉండదమ్మా! ఉన్న ఒక్కగానొక్క కొడుకు దగ్గర కాక ఎక్కడికి పోతారే తల్లిదండ్రులు. నీ అత్త మామల్ని గౌరవించడం నేర్చుకో... రేపే మేమిద్దరం వచ్చి నిన్ను అక్కడ వదిలేసి వస్తాం. తయారుకా..."

తల్లి ఇచ్చిన సలహా మందులా పనిచేసింది. పార్వతి మనసునావరించిన పొరలు తొలగిపోయాయి.

*** *** ***

ఈ కర్ఫ్యూలో కొడుకు ఎలా ఉన్నాడోనని వసంతమ్మగారు తల్లడిల్లిపోయారు. కోడలు కూడా ఊళ్ళో లేదు. ఆమె ఇంక ఆగలేకపోయింది. కడుపు తీపి.

"ఏమండీ! మనం వెళ్ళిపోదామండి వాడెలా ఉన్నాడో ఏమో..."

"అవును.....వెళ్దాం! బయల్దేరు"

నెల్లూరులో గొడవలు కొంత సద్దుమణిగాయి.

తల్లిదండ్రులను చూచిన శేషగిరికి ఆనందానికి అంతులేదు. తల్లి ఒడిలో తలపెట్టి ఆక్రోశించాడు.

భార్య ఇంతవరకు రానందుకు మొరపెట్టుకున్నాడు తల్లిదండ్రులతో..

"ఓరికుంక... నీపెళ్లామేరావాలా... నీవెందుకు వెళ్లకూడదు. వెళ్లి వెంటనే పిల్చుకురా..." సుందరరామయ్య కొడుకును బయల్దేరదీశాడు.

సూట్‌కేసుతో బయల్దేరపోతున్న శేషగిరికి వాకిటిలోనే ఎదురైంది పార్వతి...

"మీకో హాట్ న్యూస్"

"హాట్ న్యూస్ అంటూ హడలెత్తించకే... చెప్పు" చెవికొరికింది పార్వతి.

పార్వతి తల్లిదండ్రులు అప్పటికే వసంతమ్మ సుందరరామయ్యలకు విషయం చెప్పడం వాళ్ళ కళ్ళలో ఆనందం చిందులేయడం ప్రకృతిలోని ప్రేమను వెదజల్లినట్లుగా ఉంది. సహజీవన సౌందర్యం అది.

శేషగిరికి అప్పటి నుంచి చీమలంటే ద్వేషం పోయింది.

# చిన్నపిల్లల్లో స్థూలకాయం

బాలబాలికల్లో స్థూలకాయత ఎక్కువవుతోందని అమెరికా వంటి అభివృద్ధిచెందిన దేశాల్లో ఆందోళన చెందుతున్నారు. మన దేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఇంకా అంత తీవ్రతరం కాకపోయినా, పెరుగుతున్న జీవనప్రమాణాల దృష్ట్యా, ఆహారపుటలవాట్లలో వస్తున్న మార్పుల దృష్ట్యా మనం కూడా ఈ సమస్యను గురించి కొంత పట్టించుకోవలసిన అవసరం ఏర్పడింది. తక్కువ కొవ్వు ఉన్న ఆహారపదార్థాలు తినడం, తగుమాత్రం వ్యాయామం చెయ్యడం మంచి అలవాట్లు అనడంలో ఏమాత్రం సందేహంలేదు.

చాలామంది ఇంకా స్థూలకాయత కేవలం సౌందర్య సమస్యగా భావిస్తారు. కాని అది ఆకలి నియంత్రణ, శక్తి జీవక్రియలకు సంబంధించిన తీవ్ర వ్యాధి అని వైద్య పరిశోధకులంటారు. జన్యు, పర్యావరణ, సామాజిక, ఆర్థిక, మానసిక కారకాలన్నీ కలసి దాన్ని ప్రభావితం చేస్తాయి. స్థూలకాయత ఒక ముఖ్యమైన దీర్ఘకాలిక, క్షయకారక వ్యాధి. అది వ్యక్తులను బలహీనపరిచి, అకాలిక మరణానికి గురిచేస్తుందని గుర్తించాలని వైద్య నిపుణులు అంటున్నారు. స్థూలకాయతకు మధుమేహం, అధిక రక్తపీడనం, గుండెజబ్బు, కొన్నిరకాల కాన్సర్, పిత్తాశయ వ్యాధి, కీళ్లనొప్పులు, మొదలైన వ్యాధులతో ప్రత్యక్ష సంబంధం ఉంది. ఈ వ్యాధుల్లో కనీసం కొన్ని అయినా చిన్నపిల్లల్లో మొదలవుతాయని తులేన్ యూనివర్సిటీకి చెందిన డా॥ గెరాల్డ్ బెరెన్‌సన్ అన్నారు. ధమనుల గోడలు త్వరలో గట్టిపడగల కొవ్వు నిక్షేపాలు 3 సంవత్సరాల వయసు పిల్లల్లో తాను చూశానని డా॥ బెరెన్‌సన్ అన్నాడు.



డా॥ బెరెన్‌సన్ తన అధ్యయనం 1973లో ప్రారంభించాడు. అప్పుడు ఒకే వయస్సు, ఎత్తువున్న పిల్లలు ఈనాటి పిల్లలకన్నా 3-4 పౌన్లు తక్కువ బరువు ఉండేవారని తేలింది. అమెరికన్ బాలబాలికలలో నాలుగో వంతు మందిలో ఇప్పటికే కొలెస్టెరాల్ స్థాయి 170 లేదా ఇంకా ఎక్కువ ఉంది. ఇది చైనా, థాయ్‌లాండ్, ఇతర దేశాలలో కన్నా చాలా ఎక్కువ. చిన్నపిల్లల కొలెస్టెరాల్ స్థాయికి 40, 50 కలిపితే వారు పెద్దయ్యాక ఉండే కొలెస్టెరాల్ స్థాయి తెలుస్తుంది. ఉదాహరణకి ఒక బాలుని కొలెస్టెరాల్ స్థాయి 170 అయితే, దానికి 40 కలిపితే 210 అవుతుంది. అది చాలా ఎక్కువ.

1980 నుంచి బాల స్థూలకాయత 6 శాతం పెరిగింది. టీనేజర్లలో 21 శాతం మంది అధిక బరువుగలవారుగా భావించబడుతున్నారు. బాలురలో 20 శాతం మంది, బాలికల్లో 22 శాతం మంది అమెరికాలో అధిక భారం చూపుతున్నారు.

అమెరికాలో పొగతాగడం వల్ల సాలీనా సంభవించే మరణాల సంఖ్య 500,000 కాగా స్థూలకాయతకు సంబంధించిన కారణాల వల్ల మరణించే వారి సంఖ్య 300,000. టి.వి. కంప్యూటర్ గేమ్స్, వీడియో గేమ్స్ వచ్చాక పిల్లలు ఆరుబయట ఆడుకునే అలవాటు తగ్గిపోయి, వ్యాయామం కొరత పడుతోంది. పెద్దవారిలో వచ్చే గుండెజబ్బు మొదలైన వ్యాధులకు పునాదులు బాల్యంలో పడుతున్నాయి.

మన దేశంలో కూడా ఐస్-క్రీమ్, ఫాస్ట్ ఫుడ్స్ వంటి అలవాట్లు ముఖ్యంగా నగరాలలో ప్రచారం పొందడంతో ఆరోగ్యం దృష్ట్యా బాలబాలికలను, యువతీయువకులను హెచ్చరించవలసిన అవసరం కనిపిస్తోంది. ఒక విధంగా చూస్తే పల్లెలలో నివసించే వారే ఆరోగ్యవంతమైన ఆహారం తిని, ఆరుబయట పొలాల్లో గడుపుతారనిపిస్తుంది. అయితే వారికుండే సమస్యలు వారికుంటాయి.

- ఆర్.ఎల్.ఎస్. శాస్త్రి